క్లుప్తంగా

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

అమరచింత: మండలంలోని ఈర్లదిన్నెలో సోమవారం నుంచి దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు కొనసాగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. 15న సత్యానంద భారతి స్వామి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు. వినాయక, సుబ్రహ్మణ్యస్వామి, శివలింగం, నందీశ్వర, ఆంజనేయ స్వామి, నాగులు, నవగ్రహ, ధ్వజస్తంభం, కార్తీకదీప స్తంభం, బొడ్రాయికి పూజలు నిర్వహించి ప్రతిష్ఠాపన చేయనున్నారు. మూడు రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు ఉంటాయని, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మసీద్ కమిటీకి రాజీనామా

అమరచింత: పట్టణంలోని రహెమానియ మసీద్ కమిటీ పూర్తి రద్దు చేయలేదని అధ్యక్షుడు నిసార్ తెలిపారు. కమిటీలో కొనసాగుతున్న గౌస్, షంషీర్, అబ్దుల్ సలాం వ్యక్తిగత రాజీనామాలు సమర్పించారన్నారు. ఆదివారం మసీద్‌లో కమిటీలో సభ్యులతో సమావేశం నిర్వహించి రాజీనామ పత్రాలు సమర్పించిన ముగ్గురి రాజీనామాలను ఆమోదించామన్నారు. త్వరలోనే కొత్త సభ్యులను ఎన్నుకోనున్నట్లు తెలిపారు.

జంగిడి బుచ్చన్న మృతికి సంతాపం

వనపర్తిటౌన్: మున్సిపల్ మాజీ కౌన్సిలర్, నాయకుడు జంగిడి బుచ్చన్న (86) ఆదివారం మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొంది తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. ఈయన 2005లో కాంగ్రెస్ పార్టీ తరుపున కౌన్సిలర్‌గా గెలుపొందారు. తపాల ఉద్యమ కార్మిక నాయకుడిగా ఈయనకు పేరుంది. కొన్నేళ్లుగా పాలమూరు అధ్యాయన వేదిక జిల్లా శాఖకు కన్వీనర్‌గా వ్యవహరించారు. మృతి విషయం తెలుసుకున్న మంత్రి నిరంజన్‌రెడ్డి, కాంగ్రెస్ నేత చిన్నారెడ్డి, మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్ శ్రీధర్, నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ట్రాఫిక్‌తో ఇబ్బందులు



ఆత్మకూర్: పట్టణంలోని గాంధీచౌక్‌లో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో సమయం వృథా అవుతుందని పాలకమండలి, పోలీసులు దృష్టి సారించాలని వాహనదారులు కోరుతున్నారు. గాంధీచౌక్ నుంచి కొత్తకోట రోడ్డు, బస్టాండ్‌రోడ్డు, అమరచింతరోడ్డు వైపుగా డివైడర్ల నిర్మాణ పనులు చేపడుతున్న కారణంగా ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని చైర్‌పర్సన్ గాయత్రి తెలిపారు. డివైడర్లు, ఇరువైపుల సీసీ రోడ్ల పనులు, చెరువు కట్ట నుంచి గాంధీచౌక్ వరకు బీటీరోడ్డు పనులు త్వరలోనే చేపడుతామని చైర్‌పర్సన్ పేర్కొన్నారు.

శిథిలావస్థలో పాఠశాల భవనం

- ఐదు పర్యాయాలు టెండర్లకు ఆహ్వానం
- పనుల కోసం ముందుకు రాని కాంట్రాక్టర్లు



శిథిలావస్థలో కార్యాలయ గది

అమరచింత: మన ఊరు –మన బడి కార్యక్రమం ద్వారా పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడు తరగతి గదులను తొలగించి వాటి స్థానంలో కొత్త భవనాలకు అధికారులు రూ.4.65కోట్లతో మొదట ప్రతిపాదించారు. వీటిని కేటాయించాలని నివేదికను జిల్లా విద్యాధికారితో పాటు పాటు ప్రభుత్వానికి నివేదించారు. రెండో విడతలో పాఠశాలకు మన ఊరు–మనబడి ద్వారా రూ.82 లక్షలు మంజూరు చేశారు. పాఠశాల పునః ప్రారంభ సమయంలో వీటికోసం ప్రతిపాదనలు సిద్ధం చేసిన అధికారులు పాఠశాల మూత పడే సమయానికి సైతం పనులను మొదలు పెట్టలేక పోయారు. మంజూరైన పనుల కోసం అధికారులు ఇప్పటికి ఐదు సార్లు టెండర్లు పిలిపించిన ఒక్క కాంట్రాక్టర్ ముందుకు రాలేదు. ఇప్పటి వరకు టెండర్ ప్రక్రియ పూర్తి కాక పోవడంతో పీఆర్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. చివరకు పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్‌తో పనులు చేయించవచ్చని అధికారులు ముందుకు వచ్చిన, వారు కూడా ముందుకు రాలేకపోతున్నారు. ప్రస్తుతం మన ఊరు –మన బడి ద్వారా మొదటి విడతలో కేవలం రూ.30 నుంచి రూ.60 లక్షల మధ్య ఖర్చుతో ఉన్న పాఠశాలల నిర్మాణాలను గుర్తించిన అధికారులు వీటిని మరుగున పడేశారు. దీంతో ఎప్పుడు పాఠశాల గదులు కూలుతాయో అన్న సందేహాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు బిక్కుబిక్కుమంటూ కాలం కాలన్ని గడిపే పరిస్థితులు దాపురించాయి. ఈ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు ఇంగ్లిష్, తెలుగు మీడియంలు కొనసాగుతున్నాయి. మొత్తంగా 524 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.



పెచ్చులూడుతున్న తరగతి గదులు

పెచ్చులూడుతున్న తరగతి గదులు

పాఠశాలలో మొత్తంలో ఏడు తరగతి గదులు శిథిలావస్థలో ఉన్నాయి. ఏళ్లుగా గదులలో పెచ్చులూడుతున్నాయని అధికారులు, ప్రజాప్రతినిధులకు పాఠశాల ఉపాధ్యాయులు విన్నవించారు. మన ఊరు –మన బడిలో వీటిని గుర్తించారు. ఇప్పటి వరకు ఎలాంటి స్పందన కనిపించడం లేదు. భారీ మొత్తంలో నిధులు అవసరం కావడంతో రెండవ విడతలో వీటిని నిర్మించాలని భావించిన అధికారులు అంచనా విలువను నివేదించడంతోనే సరిపెట్టారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియంలకు 12 గదులు, ఆఫీస్ రూంతో పాటు 13 గదులు ఉండాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం 10 గదులు మాత్రమే ఉండడంతో వాటిలోనే విద్యార్థులకు పాఠాలు చెబుతున్నారు.

ఐదు సార్లు టెండర్లు ఆహ్వానించాం..

పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మన ఊరు–మనబడి ద్వార రూ.82 లక్షలు మంజూరయ్యాయి. వీటితో తరగతి గదితో పాటు కిచెన్, డైనింగ్ హాల్, బాత్‌రూంలు, అదనపు గది, ఎలక్ట్రిక్ పనులు, నీటి సరఫరాతో పాటు చిన్నచిన్న మరమ్మతుల కోసం టెండర్లు ఆహ్వానించాం. ఐదు సార్లు టెండర్లు వేస్తూనే ఉన్నా ఒక్కరు సైతం ముందుకు రావడం లేదు. పనుల కోసం నిధుల కొరత లేదని ఎవరైనా పనులు చేస్తే వెంటనే బిల్లులు అందించేలా చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్‌రావు, ఈ పంచాయతీరాజ్

మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలి



మాట్లాడుతున్న జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జితేందర్‌గౌడ్

పాన్‌గల్: మతోన్మాదానికి వ్యతిరేకంగా విద్యార్థులు, యువత పోరాడాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు జితేందర్‌గౌడు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని తెల్లరాళ్లపల్లిలో పాఠశాల ఆవరణలో ఎస్ఎఫ్ఐ జిల్లా స్థాయి నాయకత్వ శిక్షణ తరగతులు నిర్వహించారు. 'మతం–మతోన్మాదం' అంశంపై ఆయన మాట్లాడారు. దేశంలో బీజేపీ రెండో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత మతం, కులం పేరుతో దాడులు అధికమైనట్లు పేర్కొన్నారు. సాంస్కృతిక రంగంలో మార్పులు చేసి చరిత్రని బీజేపీ ప్రభుత్వం వక్రీకరిస్తుందన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. ప్రజల స్వేచ్ఛ, స్వాతంత్ర్యాన్ని కేంద్ర ప్రభుత్వం హరిస్తుందన్నారు. శాస్త్రీయ విద్యా సాధనకై, లౌకిక ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆది, రాఘువ, బాల్యనాయక్, కాకం అంజన్న, నాయకులు పాల్గొన్నారు.

దళితబంధు వర్తింపజేసి ఆదుకోండి



కుటుంబ సభ్యులతో ఎర్ర రాములు

పాన్‌గల్: దళితబంధు వర్తింపజేసీ కుటుంబాన్ని ఆదుకోవాలని మండలంలోని జమ్మాపూర్‌నకు చెందిన దళిత ఎర్రరాములు కోరుతున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న దళితబంధును పేద కుటుంబానికి వర్తింపజేస్తే మేలు కలుగుతుందన్నారు. ఇంటర్ వరకు చదువుకుని కుటుంబ పోషణ కోసం పాలు అమ్ముకుని జీవనం సాగిస్తున్నట్లు పేర్కొన్నారు. సెంటు భూమి లేదని, ఇల్లు కూడా లేదని పూరి గుడిసెలో నివసిస్తున్నామన్నారు. నలుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారని, పెద్ద కుమార్తె ఇంటర్ వరకు చదివి ఇంటి వద్దే పాల వ్యాపారంలో తోడ్పాటు అందిస్తున్నట్లు తెలిపారు. తనతో పాటు భార్య, కుమార్తెలు కూలీ పనులు చేస్తున్నారన్నారు.

విద్యార్థుల్లో ప్రజ్ఞ వికసించాలి



ధ్యానం చేస్తున్న చిన్నారులు

వనపర్తిటౌన్: విద్యార్థుల్లో ప్రజ్ఞ వికసించాలని వికాస తరంగిణి వీటీ కార్యకర్త శ్రీనివాస రామానుజదాస అన్నారు. ఆదివారం వికాస తరంగిణి ఆధ్వర్యంలో స్థానిక వేంకటేశ్వర ఆలయంలో ఐదేళ్ల నుంచి 15ఏళ్ల లోపు పిల్లలకు ప్రజ్ఞ వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో వ్యక్తిత్వం, నైతిక విలువలను పెంపొందించడం ద్వారా మానవీయ సమాజం రూపుదిద్దుకుంటుందన్నారు. విద్యార్థుల్లో ఆలోచన శక్తిని, సృజనాత్మకతను పెంపొందించేందుకు ప్రజ్ఞ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. విద్యార్థుల్లో ప్రాథమిక స్థాయి నుంచి ఆధ్యాత్మిక భావన ప్రేరేపిస్తే సత్ప్రవర్తన పౌరులుగా రాణిస్తారని చెప్పారు. కార్యక్రమంలో శ్రీవాణి, శ్రీలక్ష్మీ, రాజేశ్వరి, పద్మావతి, సుమిత్రమ్మ, మంగమ్మ, పద్మమ్మ, విమల, రాధిక, వీరమణి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 1991–92 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పలువురు ఆదివారం సమ్మేళనంలో భాగంగా ఒకే వేదికపై కలుసుకున్నారు. జీవితంలో వివిధ స్థాయిల్లో స్థిరపడిన వారు యోగ క్షేమాలను తెలుసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు రాఘవాచారి, వేమన్న, బాలచంద్రయ్య, పార్థసారథి, శైలజ తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో రామలింగం, కురుమయ్య, రాజవర్ధన్‌రెడ్డి, బీచుపల్లి, ఎల్లస్వామి, పర్వతాలు, దయాకర్, కృష్ణయ్య, ముబిన్, అరుణ, లత తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా హనుమాన్ జయంతి



ఆత్మకూర్‌లో ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

ఆత్మకూర్: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని నేతాజీనగర్, బీసీకాలనీలోని హనుమాన్ మందిర్‌లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. పూజల్లో మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు శ్రీనివాసులు, విఠల్‌రావ్ ఆధ్వర్యంలో వేర్వేరుగా అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు. రాత్రి పట్టణ పురవీధుల గుండా హనుమాన్ శోభాయాత్ర కొనసాగింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, వైస్ చైర్మన్‌విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీపీ శ్రీను, వైస్ ఎంపీపీ కోటేష్, విండో అధ్యక్షుడు గాడికృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, రవికుమార్‌యాదవ్, అనిల్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.



ఊరేగింపులో పాల్గొన్న యువకులు

ఘనంగా బీరప్ప పండుగ



అప్పారెడ్డిపల్లిలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

ఖిల్లాఘనపురం: మండలంలోని అప్పారెడ్డిపల్లిలో ఆదివారం బీరప్ప పండుగను కుర్వ యాదవులు ఘనంగా నిర్వహించారు. ఉదయం గ్రామ సమీపంలో ఉన్న బీరప్ప దేవాలయం వద్ద స్వామివారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కుర్వ యాదవులు ఇళ్ల వద్ద కుంకుమ, పసుపు, తదితర వాటితో అలంకరించిన బోనాలలో ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యాన్ని తీసుకుని గ్రామం నుంచి దేవాలయం వరకు ఊరేగింపుగా వెళ్లారు. గొర్రె పొటేళ్లను కోసి అక్కడే మందగా ఉంచిన గొర్రెలపై పొలిచల్లారు.

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

స్టేషన్ మహబూబ్‌నగర్: కల్వరి ఎంబీ చర్చి కార్యవర్గ ఎన్నికలు శనివారం నిర్వహించగా బీఐ జాకబ్ ప్యానల్ విజయం సాధించింది. చర్చి వైస్ చైర్మన్‌గా బీఐ జాకబ్, కార్యదర్శిగా జేఐ డేవిడ్, కోశాధికారిగా టీఏ స్టీవెన్, అసిస్టెంట్ కార్యదర్శిగా కేఎస్.ఇమ్మానుయేల్ రాజ్, అసిస్టెంట్ కోశాధికారిగా ఎ.టైటస్, డీకన్స్‌గా బీఏ.విక్టర్, దాసరి సుందర్, ఎస్‌బీ. అబ్రహం, జోసెఫ్ సతీష్‌కుమార్, ఎల్.రవికుమార్, కేఎ.శ్యాంకుమార్, కేఆర్ ఫిలిఫ్, బీఏ.ప్రదీప్‌కుమార్, ఎల్డర్స్‌గా పానుగంటి సామ్యేల్, కేఎస్.ప్రేమ్‌రాజ్, ఆడిటర్స్‌గా తూపిలి మారడోనా, జోసెఫ్ రావ్‌లిన్, డీజే.రాజు ఎన్నికైనట్లు ఎలక్షన్ ఆఫీసర్ ఆర్ఏస్.డేవిడ్ ప్రకటించారు.

పాఠశాల ఆవరణ మురుగుమయం



పాఠశాల రోడ్డు పక్కన చేరిన మురుగు

దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బందులు

ఆత్మకూర్: పట్టణంలోని ప్రభుత్వ ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాల ఆవరణలో మురుగుమయం కావడంతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అకాల వర్షాకాల కారణంగా చేరిన నీటితో పాటు, మురుగు నిల్వ ఉండడంతో దోమల అధికసంఖ్యలో వస్తున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. పాఠశాల ప్రారంభం అయ్యేలోపు డ్రెయినేజీలు నిర్మించి, ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు. ఈ విషయమై పాలకమండలి దృష్టికి తీసుకెళ్లామని వార్డు కౌన్సిలర్ నాగలక్ష్మి తెలిపారు.

మత రాజకీయాలకు తిరస్కరణ తప్పదు

ఆత్మకూర్: బీజేపీ మత రాజకీయాలకు కాలం చెల్లిందని, ఇందుకు కర్ణాటకలోని ఎన్నికల్లో సాక్ష్యమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్ అన్నారు. ఆదివారం రాత్రి పట్టణంలో హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కర్ణాటక ఎన్నికల్లో స్వయంగా ప్రధాని ఎన్నోసార్లు ప్రచారం చేసి, ఉచితంగా సిలిండర్లు ఇస్తామని ప్రకటించినా, బజరంగ్ బలి పేరుతో రెచ్చగొట్టిన అక్కడి ప్రజలు ఓటు ద్వారా సమాధానం చెప్పారని అన్నారు. పార్టీకి 136 మంది ఎమ్మెల్యేలు గెలుపొంది సంపూర్ణంగా ప్రభుత్వం ఏర్పాటు చేయనుందని పేర్కొన్నారు. ప్రజల్లో మార్పు వస్తుందని బీజేపీ ప్రభుత్వ ఆస్తులను అమ్మడమే తప్పా, అభివృద్ధి లేదనే విషయం ప్రజలకు అర్థమైపోయిందని ఎద్దేవ చేశారు. తెలంగాణలో పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అయ్యూబ్ ఖాన్, తులసీరాజ్, రహెమతుల్లా, పరమేష్, శ్రీను ఉన్నారు.

క్రీడాకారుల కోసం వేసవి శిబిరాలు

- వివిధ క్రీడలు నేర్చుకుంటున్న వైనం
- సోళీపురం, ఖిల్లాఘనపురంలో ప్రత్యేక శిక్షణ



ఖిల్లాఘనపురం మినీ స్టేడియంలో పరుగులు తీస్తున్న చిన్నారులు

ఖిల్లాఘనపురం: ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారుల్లో క్రీడా నైపుణ్యం పెంపొందించేందుకు అథ్లెటిక్స్, హాకీ ఉచిత వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేసింది. ఈ శిబిరాలకు పలు గ్రామాల నుంచి క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని శిక్షణ పొందుతున్నారు.

అథ్లెటిక్స్, హాకీ శిక్షణ

గ్రామీణ క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు మండలంలో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో రెండు గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేశబూరు. మండలంలోని సోళీపురంలో హాకీ శిబిరంలో పీఈటీ మన్యం శిక్షణ ఇస్తున్నారు. మండల కేంద్రంలోని మినీ స్టేడియం గ్రౌండ్‌లో అథ్లెటిక్స్ వేసవి శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేసి ఎన్ఐఎస్ అథ్లెటిక్స్ కోచ్ దేవేందర్ శిక్షణ ఇస్తున్నారు. క్రీడాకారులు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం హాకీ, రన్నింగ్, లాంగ్ జంప్, షాట్‌పుట్, జావలింగ్‌త్రో శిక్షణ పొందుతున్నారు.

ఉచితంగా క్రీడా సామగ్రి

శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారులకు అవసరమైన క్రీడా సామగ్రిని జిల్లా యువజన, క్రీడల శాఖ వారు ఉచితంగా అందిస్తున్నారు. మే 1 నుంచి 31 వరకు శిక్షణ ఇచ్చి, ప్రశంసాపత్రాన్ని అందిస్తారు. 8 నుండి 14 ఏళ్ల క్రీడాకారులు హాకీ శిబిరంలో 30 మంది, అథ్లెటిక్స్ శిబిరంలో 45 మంది శిక్షణ తీసుకుంటున్నారు.



వ్యాయామం చేస్తున్న విద్యార్థులు



సోళీపురంలో హాకీ శిక్షణ..

చాలా ఉపయోగంగా ఉంది



మా గ్రామంలోని పాఠశాల ఆవరణలో వేసవి హాకీ శిక్షణ శిబిరం చాలా ఉపయోగపడుతుంది. కోచ్ మాకు మెళకువలు నేర్పిస్తున్నారు. మాకు అందించిన శిక్షణతో మున్ముందు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తాం.

– జోత్స్న, ఖిల్లాఘనపురం

మంచి అవకాశం



గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం మంచి పరిణామం. క్రీడాకారులకు ఇది మంచి అవకాశం. సద్వినియోగం చేసుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలి.

–దేవేందర్, కోచ్

ఐజీ రమేష్‌రెడ్డిని సన్మానించిన నాయకులు



ఐజీ రమేష్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆత్మకూర్: ఐజీగా నియమితులైన మస్తిపురం రమేష్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నాయకులు పూల మాలలు, శాలువాతో సన్మానించారు. ఆదివారం పదోన్నతి పొందిన తర్వాత మండలంలోని మస్తిపురంకు వచ్చిన ఆయనను రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్, నారాయణపేట డీసీసీ అధ్యక్షుడు వాకిటిశ్రీహరి, చంద్రశేఖర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో అయ్యూబ్‌ఖాన్, తులసీరాజ్, రహెమతుల్లా, పరమేష్, నల్లగొండ శ్రీను, మహేందర్‌రెడ్డి, రవీందర్, శరణప్ప, అరుణ్, శ్యాం, విష్ణువర్ధన్ తదితరులు ఉన్నారు.

కరాటేతో స్వీయరక్షణ



శిబిరాన్ని ప్రారంభిస్తున్న మోసీన్‌ఖాన్

మహబూబ్‌నగర్ క్రీడలు: స్వీయ రక్షణ కోసం కరాటే మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని ఆల్ పార్టీ ముస్లిం లీడర్స్ కోఆర్డినేషన్ జిల్లా కమిటీ కన్వీనర్ మోసీన్‌ఖాన్, కాంగ్రెస్ మైనారీ సెల్ జిల్లా అధ్యక్షుడు జహీర్ అక్తర్ అన్నారు. మహాత్మాగాంధీ రోడ్డు స్కూల్ ఆవరణలో కింగ్‌షోటోకాన్ కరాటే క్లబ్ ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ ఆధ్వర్యంలో వేసవి 25వ ఉచిత కరాటే శిక్షణా శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు యోగా శిక్షణ అందజేశారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న మోసీన్‌ఖాన్, జహీర్ అక్తర్ మాట్లాడారు. జహంగీర్‌పాష ఖాద్రీని అభినందించారు. వైస్ చైర్మన్ చెన్న వీరయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ రఫీక్ పటేల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బెల్టు గ్రేడింగ్ పరీక్షలు

మహబూబ్‌నగర్ క్రీడలు: అప్పన్నపల్లి జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో ఆదివారం జీకే షోటోకాన్ కరాటే డూ ఇండియా మాస్టర్ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కరాటే బ్లాక్ బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. జీకే మాస్టర్ షోటోకాన్ ఫౌండర్, చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ జి.కృష్ణయ్య, చైర్మన్ రవికుమార్ ఎగ్జామినర్లుగా వ్యవహరించారు. పరీక్షల్లో ఐశ్వర్, ఎస్.హారిణి, అభినవ్, జయవంత్, నవతేజ, నిశాంత్, వినయ్‌కుమార్, రామ్‌చరణ్, సాయినందు, భూపేష్, తిమ్మప్ప, ఎల్.శ్రవణ్, గౌతమ్ బ్లాక్‌బెల్టులు సాధించారు. ఉపాధ్యాయుడు రాజేందర్, కౌన్సిలర్ రామాంజనేయులు, జీకే షోటోకాన్ కరాటే జిల్లా అధ్యక్షుడు శివకుమార్, పట్టణ అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.